సాక్షి
చిత్తూరు

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



పాడి పశువుల మృతి

జిల్లాలో భారీ వర్షాలకు పలుచోట్ల విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అవి తగిలి పాడి పశువులు మృతి చెందాయి. - 10లో



ఆర్టీసీ.. ఆదాయం వెరసి

ఆర్టీసీ అధికారులు సరికొత్త ప్రణాళికలతో నష్టాలను తగ్గిస్తూ, ఆదాయమార్గంలో సంస్థను నడిపిస్తున్నారు. - 10లో



ఆగని గజ దాడులు

పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. - 10లో

న్యూస్‌రీల్

మంత్రిపెద్దిరెడ్డికి ఘనస్వాగతం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుగుతున్న నాయకులు

కార్వేటినగరం: ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు చిత్తూరు నుంచి కార్వేటినగరం మీదుగా నారాయణవనం వెళ్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం గాండ్లమిట్ట కూడలిలో ఘన స్వాగతం పలికారు. ఓ వైపు జోరు వర్షం పడుతున్నా, నాయకులు, కార్యకర్తలు మాత్రం మంత్రి పెద్దిరెడ్డి రాకకోసం ఎదురు చూశారు. ఆయన రాగానే పెద్దఎత్తున శాలువలు, పుష్ప గుచ్ఛాలు అందించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం, మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్‌మొదలియార్, పయణిరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మిచాంగ్ తుపాన్ ప్రభావం కారణంగా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు



ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. ఆయన ఆదివారం జిల్లాకేంద్రంలోని నారాయణ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షలకు 3107 మంది విద్యార్థులకు గానూ 3001 మంది హాజరయ్యారని, 106 మంది గైర్హాజరు అయినట్లు వెల్లడించారు. అలాగే పలు పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి పరిశీలించారు.

ముగిసిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు



పూతలపట్టు పోలింగ్ కేంద్రంలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 2, 3 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఆయా పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షించారు. జిల్లాలోని 1,762 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో బీఎల్‌ఓలు పాల్గొని ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని పుంగనూరు, నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన శిబిరాల్లో ఫారం 6, 7, 8లను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన శిబిరాల్లో ఫారం 6 దరఖాస్తులు 4522, ఫారం–7 దరఖాస్తులు 2655, ఫారం–8 దరఖాస్తులు 2553 మొత్తం 9,730 దరఖాస్తులు అందాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

హృదయం.. పదిలం



స్పోక్స్ సెంటర్లలో చికిత్స అందిస్తున్న సిబ్బంది

■ గత అక్టోబర్ 16వ తేదీన కర్ణాటకకు చెందిన కుమార్‌గౌడ్ (51)కు తిరుమలకు శ్రీవారి దర్శనం కోసం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అతడికి తీవ్ర గుండె నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులంతా తల్లడిల్లిపోయారు. దీంతో వెంటనే అతడిని చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. స్పోక్స్ సెంటర్‌లోని సిబ్బంది బాధితుడికి ఈసీజీ తీసి, నిమిషాల వ్యవధిలోనే కార్డియాలజిస్ట్ సూచనల మేరకు థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ చేసి, ప్రాణాలు కాపాడారు.

మనిషి గుండె పిడికెడు. అదే ప్రాణానికి మూలం. అలుపూ సొలుపూ లేకుండా శక్తివంతంగా పనిచేసే సజీవ యంత్రం. అయితే ఆధునిక జీవనం.. ఆహారపు అలవాట్లుతో హృదయం గతి తప్పుతోంది. చెట్టంత మనిషిని నిలువునా కుంగదీస్తోంది. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం స్టెమీ కార్యక్రమం అమలుతో పేదల చిన్ని గుండెకు రక్షణ కల్పిస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం.

- గుండెదడకు ప్రభుత్వ చికిత్స
- స్టెమీ కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లావ్యాప్తంగా 24 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటు
- తక్షణమే ఇంజెక్షన్‌తో బాధితులకు భరోసా

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలకు అత్యంతప్రాధాన్యత ఇస్తోంది. అందులోను పేదలకు ఖరీదైనా వైద్యాన్ని పల్లె ముగింటకే తీసుకొస్తోంది. ప్రధానంగా గుండె దడకు బ్రేకులు వేస్తోంది. పేదలకు ఊపిరికి ఊతమిస్తోంది. స్టెమీ(ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్)అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్పోక్స్ సెంటర్లను ప్రారంభించి గుండె నొప్పి నుంచి బయటపడేలా చేస్తోంది.

12 వేల మంది హృద్రోగులు

ఉమ్మడి జిల్లాలో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. గత ఏడాది ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధ పడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్న వారు సుమారు 80 వేల మంది వరకు ఉన్నారు. అలాగే 12 వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. మనిషి ఆహార నియమాలు పాటించకపోవడంతో గుండెకు చిల్లులు పడేలా చేస్తోంది. బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి రోగాలు గుండె దడపుట్టిస్తున్నాయి. మానసిక వ్యాధి కూడా మనిషికి గుండె నొప్పిని తెచ్చిపెడుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల చాలా మంది ఛాతీలో కాస్తంత నొప్పి రాగానే ఆస్పత్రికి వెళుతున్నారు. తీరా వెళ్లాక నిజంగానే హార్ట్‌స్ట్రోక్ వచ్చిందంటూ ఎమర్జన్సీగా స్టంట్ వేయడమో? లేదంటే శస్త్రచికిత్స చేయాల్సి రావడమో జరుగుతోంది. దీనికి భిన్నంగా కనిపించే కేసులు కూడా ఉంటున్నాయి. గుండె జబ్బు బారిన పడి నిమిషాలు, గంటల వ్యవధిలో చనిపోయే వారి సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. కరోనా తర్వాత ఈ కేసులు సంఖ్య మరింత పెరిగింది. ఆస్పత్రికి వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి కేసులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏటా పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. అలాగే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వే కేసులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గుండె జబ్బుల నివారణకు చర్యలు చేపట్టింది. స్టెమీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.

రోగులకు స్టెమీతో భరోసా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 స్పోక్స్ సెంటర్లలో గత సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 5,838 మందికి ఈసీజీ తీశారు. వారిలో 148 మందికి గుండె సంబంధిత సమస్యలున్నట్లు గుర్తించారు. ఇందులో 25 మందికి థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వగా, 96 మందిని తిరుపతిలోని హబ్‌కు రెఫర్ చేశారు. తద్వారా గుండెనొప్పితో బాధపడుతున్న వారికి స్టెమీ కార్యక్రమం భరోసా కల్పిస్తోంది.

స్టెమీ కార్యక్రమం ఇలా...

స్టెమీ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీవీపీలో పరిధిలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో 24 స్పోక్స్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు 12 లీడ్స్ ఉండే ఈసీజీ మిషన్ అందజేశారు. అలాగే కంప్యూటర్ అందజేసి స్టెమీ సాఫ్ట్‌వేర్‌ను అందులో అప్‌లోడ్ చేయించారు. ఐసీయూ బెడ్, ఐవీ స్టాండ్, మల్టీ పారా మానిటర్, 26 రకాల అత్యవసర డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచారు. అత్యవసర విభాగంలో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితోపాటు ప్రత్యేకంగా ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్‌నర్సును కేటాయించారు. గుండె నొప్పితో స్పోక్స్ సెంటర్‌కు వచ్చిన వారికి తక్షణమే ఈసీజీ తీస్తారు. దీన్ని ఇంటర్‌నెట్‌కు కనెక్ట్ చేస్తారు. ఆ రిపోర్ట్‌ను స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేసిన వెంటనే రెండు నిమిషాల్లో ఆ రిపోర్ట్ వివరాలు తిరుపతి రుయాలోని హబ్‌కు చేరుతాయి. అక్కడున్న గుండె వైద్య నిపుణులు రిపోర్ట్ చూసి, ఎలాంటి చికిత్స చేయాలో ఆయాప్‌లోనే నమోదు చేస్తారు. దీని ఆధారంగా స్పోక్స్ సెంటర్‌లో సిబ్బంది రోగికి చికిత్స అందిస్తారు. అత్యవసరమైన వ్యక్తికి సెంటర్‌లోనే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తారు. తరువాత హబ్‌కు రెఫర్ చేస్తారు. ఈ ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో రూ. 30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి ఇంజెక్షన్‌లు జిల్లా ఆస్పత్రుల్లో 5, ఏరియా ఆస్పత్రుల్లో 3, సీహెచ్‌సీలో 2 వంతున అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు. తద్వారా తీవ్ర గుండె నొప్పితో వచ్చిన వారికి ఈ స్టెమీ కార్యక్రమం ప్రాణం పోస్తోంది. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా చూస్తోంది.

స్పోక్స్ సెంటర్లతో గుండె పదిలం



కరోనా తర్వాత గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గుండె జబ్బు నివారణకు చర్యలు తీసుకుంది. స్టెమీ కార్యక్రమం ద్వారా గుండె జబ్బుకు చికిత్స అందిస్తోంది. పల్లె ప్రాంతాల్లోని ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా స్టెమీతో స్పోక్స్ సెంటర్లను ఏర్పాటు చేశాం. దీనిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తరచూ ఆదేశాలిస్తున్నాం. స్టెమీ అంటే గుండె రక్తనాళం. వంద శాతం పూడిపోవడంతో వచ్చే గుండెపోటు. దీనికి గురైన బాధితుడికి వీలైనంత త్వరగా పూడికను కరిగించే చికిత్స ఇది.

-రాజశేఖర్‌రెడ్డి,
డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

ఊపిరి పోస్తోంది



జీవనశైలిలోని మార్పుల కారణంగా హార్ట్‌స్ట్రోక్ సర్వసాధారణంగా మారింది. ఎక్కువగా మగవాళ్లు గుండె జబ్బులతో చనిపోతున్నారు. శారీరక, ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, మానసిక రుగ్మతాలు తదితర కారణాలతో గుండెపై భారం పడుతోంది. ఈ ప్రభావంతో మనిషి క్షణాల్లో మృతి చెందుతున్నాడు. ఇలాంటి వ్యాధుల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వేలాది రూపాయలు విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించి, బాధితులు ఊపిరి పోస్తోంది. స్ట్రోక్ వచ్చినప్పుడు వెంటనే స్పోక్స్ సెంటర్‌కు తరలించాలి.

-శ్రీహరి,
తిరుపతి డీఎంహెచ్‌ఓ, తిరుపతి

వరుణుడి జోరు..

మిచాంగ్ తుపాన్ కారణంగా చిత్తూరు జిల్లా తడిసి ముద్దవుతోంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. సామాన్య ప్రజల జనజీవనంపై తుపాన్ ప్రభావం కనిపిస్తోంది. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

- జిల్లా అంతటా మిచాంగ్ తుపాన్ ప్రభావం
- దంచికొడుతున్న వాన
- కార్వేటినగరంలో అత్యధికంగా 95 మి.మీ వర్షపాతం
- అప్రమత్తమైన అధికారులు
- నేడు కూడా వర్షం ప్రభావం ఉండొచ్చని వాతావరణ శాఖ హెచ్చరిక



నగరి: కలుజు పారుతున్న ముడిపల్లి చెరువు

సాక్షి, చిత్తూరు: నైరుతి రుతుపవనాలతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా శనివారం అర్ధరాత్రి నుంచి జిల్లాలోని నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఇక పూతలపట్టు, కుప్పంలో కుండపోత వర్షం కురిసింది. మరో రెండు మూడు రోజుల పాటు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉంది. అయితే ఆదివారం కురిసిన వర్షానికి పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 ఎకరాల మేర కోత దశలోని వరి పంటతో పాటు కొంతమేర టమాట పంట కూడా నీట మునిగిందని అధికారులు అంచనా వేశారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు కూడా రైతులను అప్రమత్తం చేశారు. పంటల్లోకి నీరు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెరిగిన నీటి ప్రవాహం..

వర్షాలకు జిల్లాలోని పలు చెరువులు, గుంటలు, కాలువల్లో నీటి ప్రవాహం కనిపించింది. జిల్లాలోని ప్రధాన జలాశయాలైన కార్వేటినగరం పరిధిలోని కృష్ణాపురం జలాశయం, పెనుమూరు మండలం పరిధిలోని ఎన్టీఆర్ జలాశయాలకు సైతం కొంతమేర వరదనీరు చేరుతోంది. ఇలాగే మరో రెండు రోజుల పాటు వర్షాలు పడితే జలాశయాలకు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన..

ఏకధాటిగా కురిసిన వర్షానికి చిత్తూరు నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. నగర కమిషన్ అరుణ ఆయా ప్రాంతాలను పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 31.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా కార్వేటినగరంలో 95 మి.మీ వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నగరి : తుపాను ప్రభావంతో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా సహాయక చర్యలు అందించడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆర్కేరోజా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

జాగ్రత్తగా ఉండండి

చిత్తూరు కార్పొరేషన్: ప్రస్తుతం తుపాన్ ధాటికి వర్షాలు భారీగా కురుస్తున్నందున విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభ పిళ్లై ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని సమస్యలు ఉంటే 73827 74644 నంబరులో సంప్రదించాలన్నారు. ముగ్గురు ఉద్యోగులు 3 షిఫ్టుల ప్రకారం మంగళవారం వరకు పని చేస్తారన్నారు. తుపాన్‌తో ప్రభావంతో గాలీ వాన వచ్చినప్పుడు రైతులు మోటార్లు, స్టార్టర్స్, డబ్బాలు, సర్వీస్ వైర్లు, విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. లైన్ మీద చెట్టుకొమ్మలు పడినప్పుడు ముట్టుకోరాదన్నారు. తడిచేతుల్లో స్విచ్‌బోర్డులు, విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. డివిజన్ పరిధిలో 1 విద్యుత్ స్తంభం, 1 ట్రాన్స్‌ఫార్మర్ నేలవాలిందన్నారు. సిబ్బంది పునరుద్ధరణ పనులు చేస్తున్నారని వివరించారు.

తుపానుతో నష్టం

తుపాను ప్రభావంతో ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని ఈఈ హరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు రూరల్ డివిజన్‌లో 11 కేవీ విద్యుత్ స్తంభాలు 6, ఎల్‌టీ స్తంభాలు 2, ట్రాన్స్‌ఫార్మర్లు 2 నేలవాలాయన్నారు. సిబ్బంది సంరక్షణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

వర్షపాతం వివరాలు..

నగరి మండలంలో 94.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే నింద్ర, ఎస్సార్‌పురం మండలాల్లో 80.6, విజయపురంలో 65.2, పాలసముద్రంలో 55.4, చిత్తూరులో 47.4, వెదురుకుప్పంలో 46.4, పెనుమూరులో 45.2, గుడిపాల లో 40, యాదమరిలో 38.4, గంగాధర నెల్లూరులో 37.2, రొంపిచెర్లలో 32.4, సదుంలో 28.6, పూతలపట్టులో 26.6, పెద్ద పంజాణిలో 25.4, సోమలలో 22.4, పులిచెర్లలో 22.2, ఐరాలలో 14.2, గంగవరంలో 13.8, బైరెడ్డిపల్లిలో 12.6, తవణంపల్లిలో 10, చౌడేపల్లిలో 9.6 , పలమనేరులో 9.4, బంగారుపాళెంలో 9.2, పుంగనూరులో 7.2, శాంతిపురంలో 5.2, వీ కోటలో 3.8, రామకుప్పంలో 3.2, గుడిపల్లి మండలంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లాకు రెడ్ అలర్ట్

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- అన్ని శాఖలను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



పుత్తూరు : తొరూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

చిత్తూరు కలెక్టరేట్ : బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్రవాయుగుండంగా మారిన నేపథ్యంలో అధికారులు జిల్లాలో రెడ్‌అలర్ట్ ప్రకటించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 9491077356 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. సోమవారం జిల్లాలో తుపాను మరింత ప్రభావం చూపే అవకాశం ఉండడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అన్నిశాఖల జిల్లా అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు విధులు నిర్వహించే చోటే ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విపత్కర పరిస్థితులు తలెత్తితే ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు ముందస్తు సూచనలు జారీచేశారు.

ముందస్తు చర్యలు..

తుపాను నేపథ్యంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పౌరసరఫరా తదితర శాఖల అధికారులకు కలెక్టర్ షణ్మోహన్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 24 గంటల పాటు పనిచేసేలా సిబ్బందిని నియమించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందికి సెలవులు ఇవ్వరాదని, ఎవరూ జిల్లాకేంద్రం దాటి వెళ్లరాదని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పౌరసరఫరాలశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిత్యావసర సరుకులు అవసరమైన మేరకు సిద్ధం చేసుకున్నారు. అలాగే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సోమవారం అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లకూడదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

తప్పుడు రాజకీయాలు చేయొద్దు అమర్



మాజీమంత్రి అమరనాథ్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్న నల్లసానిపల్లి ప్రజలు

గంగవరం: 'మా ఊరికి మీరేం చేశారు.. దశాబ్దాల కాలంగా మా గ్రామానికి రోడ్డు కావాలని అడిగి అడిగి అలసిపోయాం.. కానీ మీరు పట్టించుకున్న పాపాన పోలేదు.. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎమ్మెల్యే వెంకటేగౌడ సహకారంతో మా ఊరికి రోడ్డు మంజూరు చేయించారు.. మా ఊరి ప్రజల చిరకాల కోరికను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు.. మాకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు..' అని నల్లసానిపల్లి గ్రామస్తులు మండిపడ్డారు. శనివారం మాజీమంత్రి అమరనాథరెడ్డి నల్లసానిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని తానే అభివృద్ధి చేసినట్టు, రోడ్డు కూడా తానే వేస్తున్నట్టు చెప్పడంతో పాటు ప్రభుత్వంపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆగ్రహించిన గ్రామస్తులు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మీడియా సమక్షంలో ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో 40 ఏళ్ల చరిత్ర అని చెప్పుకునే అమరనాథ్‌రెడ్డి తన స్వలాభం చూసుకున్నారు తప్ప ఏ ఊరినైనా అభివృద్ధి చేశారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమ ఊరికి రోడ్డు వేస్తుంటే మాజీమంత్రి మాత్రం తానే రోడ్డు వేయిస్తున్నట్టు చెప్పడం ఏంటని, తన ఇంట్లో సొమ్ముతో ఏమైనా వేయిస్తున్నారా ? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో స్వలాభం కోసం, పదవుల కోసం అడ్డదారులు తొక్కిన వాళ్లను దూరం పెడతారని, మంచి చేసినవాళ్లను, రాజకీయాల్లో హుందాతనంగా ఉంటేనే ఆదరిస్తారన్నారు. ఎవరెన్ని చెప్పినా తాము ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగనన్నకే మద్దతుగా ఉంటామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోయకొండకు భక్తుల తాకిడి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధవాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి పిండి,నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి , ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.


ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ


బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ


పంటలపై ఆగని గజ దాడులు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి పేటూరు ఫారెస్టు బీటు నుంచి గుంపుగా వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, శ్రీరాములు, ఈశ్వరమ్మ తదితరులు సాగు చేసిన వరి పంటను ధ్వంసం చేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. ఏనుగుల దాడుల్లో చేతికొచ్చిన పంటలను నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పంట నష్టాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పేదలకు అనుగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం పేదలను అనుగ్రహించింది. బడుగులకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం అమలు చేసింది. సొంతిల్లు లేని అర్హులందరికీ ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసింది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించింది. ఫలితంగా నిరుపేదల సొంతింటి స్వప్నం నెరవేరింది. సొంత గూటికి చేరిన లబ్ధిదారులు చెప్పలేనంత ఆనందం పొందారు. దీనిపై పేదలు ఏమన్నారంటే..

–చిత్తూరు కలెక్టరేట్




ప్రభుత్వం నిర్మించిన పేదలందరికీ ఇళ్లు

అది మా వల్ల అయ్యే పని కాదు



కూలీకెళితేనే కడుపు నిండుతుంది. ఇంక సొంతిల్లు కట్టుకోవడమంటే అది మా వల్ల అయ్యే పని కాదు. రోజు పనికి వెళితే వచ్చే ఆదాయంతో కుటుంబం గడుస్తుంది. సొంతంగా ఇల్లు కట్టుకోలేక 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. అద్దె పెంచితే తక్కువ ఉన్న ప్రాంతానికి మారిపోతాం. ఇలా మూడు ప్రాంతాలకు మారాము. నెలకు రూ.1500 అద్దె చెల్లించే నాటి నుంచి రూ.3500 వరకు అద్దె చెల్లించాం. **జగనన్న పుణ్యమా?** అని సొంతంగా ఇల్లు కట్టుకునేందుకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహా యం చేశారు. ప్రస్తుతం సొంతింట్లో సుఖంగా ఉంటున్నాం. సీఎం మేలును ఎన్నటికీ మరువలేం.

– వెంకటేశులు, పద్మావతినగర్, నగరి

రైలులో చిరువ్యాపారం చేసుకుంటుంటా...



మాది కుప్పం. నా భర్త రాజేంద్ర రైలులో చిరువ్యాపారం చేస్తుంటారు. వచ్చే అరకొర డబ్బుతో జీవనం కొనసాగిస్తుంటాం. 20 ఏళ్ల కిందట పొట్టకూటి కోసం తమిళనాడు నుంచి కుప్పం పట్టణానికి వచ్చాం. అప్పటి నుంచి ఇక్కడే ఉండిపోయాం. నాకు ఇద్దరు పిల్లలు. చూస్తూనే పిల్లలు పెద్దగా అయిపోతున్నారు. అయితే సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి. అద్దెలు చెల్లించుకునే స్తోమత **లేక పూరి గుడిసెలోనే 20 సంవ**త్సరాలు గడిపాం. గతంలో అధికారులకు సొంతింటి కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదు అని చెప్పేవారు. జగనన్న సీఎం అయ్యాక మాకు ఇంటి పట్టాతో పాటు ఇంటి నిర్మాణం చేయించారు. సీఎం మేలు ఎన్నటికీ మరిచిపోము.

– శశికళ, లబ్ధిదారు, కుప్పం.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మాది కార్వేటినగరం మండలం. పద్మసరస్సు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటుంటాం. కూలీ నాలీ చేస్తేనే మాకు జీవనం సాగుతుంది. సొంతంగా ఇల్లు కట్టుకోవాలంటే స్థలం కొనే స్తోమత మాకు లేదు. ఎప్పటికీ సొంతంగా ఇల్లు కట్టుకోలేమని ఉండిపోయాం. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న హామీని నెరవేర్చారు. మంచి ప్రాంతంలో ప్రభుత్వమే స్థలం కేటా**యించి, ఇల్లు కట్టించింది. ప్రభుత్వం** అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నా ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నాను. ఎలాంటి లోటు లేకుండా సొంత ఇంట్లో ఇంటిల్లిపాది సంతోషంగా ఉంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మల్లేశ్వరి, పద్మసరస్సు, ఎస్టీ కాలనీ, కార్వేటినగరం

గతంలో ఇంటి స్థలమే ఇవ్వలేదు....



గతంలో ఇంటి స్థలం కావాలని ఎన్నో సార్లు మండల అధికారులకు వినతి పత్రం ఇచ్చాం. ఎన్ని సార్లు వినతి ఇచ్చినా పట్టించుకుని ఉంటే ఒట్టు. ఇంకెప్పటికీ మాకు ఇంటి స్థలం ఇవ్వరులే అని ఆశలు వదిలేశాం. ఇంటి స్థలమే ఇవ్వని వారు ఇంక ఇంటి నిర్మాణం ఎలా చేయిస్తారులే అనుకుని అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు మా ఇంటి వద్దకు వచ్చి మా **వివరాలు తీసుకున్నారు. మేము ఏ** కార్యాలయానికి వెళ్లకుండానే మా ఇంటికే ఇంటి పట్టా తెచ్చి ఇచ్చారు. ఇచ్చిన స్థలం లో ఇల్లు కూడా ప్రభుత్వమే కట్టించింది. ఇంత మేలు చేసిన సీఎంకు ఇంటిల్లి పాది రుణపడి ఉంటామయ్యా.

– ఫజానా, తగ్గువారిపల్లె, బంగారుపాళెం మండలం.

సర్కారు స్కూళ్ల బలోపేతానికి కృషి

- యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో డీఈఓ విజయేంద్రరావు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు స్కూళ్ల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. యూటీఎఫ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మెజు శ్రీనివాసరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేడర్ స్ట్రెంత్ జరిగినప్పటి నుంచి 250 మంది టీచర్లకు జీతాలు లేవని ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, జీవీ రమణ మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణోత్సవ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, నాయకులు సుధాకరరెడ్డి, మునిరత్నం, దక్షిణామూర్తి, ఎస్‌పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం వెలుపల ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సినీ నటుడు వేణు, సినీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.అరవింద్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, సినీ నటుడు వేణు, సినీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

తిరుమలలో సినీ హీరో నాని

శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి అలిపిరి కాలినడక మార్గాన ప్రముఖ సినీహీరో నాని నడుచుకుంటూ తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా ఆయన సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమలలో నాని

రెండు బైక్‌ల ఢీ : ఒకరి మృతి

ఏర్పేడు : మండలంలోని మన్నసముద్రం వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మునిచంద్ర(32) బైక్‌పై ఏర్పేడుకు వెళుతుండగా మన్నసముద్రం క్రాస్ వద్ద గుర్తు తెలియని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మునిచంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.


ఘటనాస్థలంలో మునిచంద్ర మృతదేహం

వర్షానికి పాడి పశువుల మృతి

వరదయ్యపాళెం: భారీ వర్షాలకు మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో 3 పశువులు మృతి చెందాయి. పెద్ద పాండూరు వద్ద విద్యుత్ తీగ తెగిపడి షాక్ తగలడంతో షేక్ మహబూబ్‌కు చెందిన రూ.70 వేలు గేదె మృతి చెందింది. అలాగే కరెంట్ షాక్‌తో చిన్న పాండూరుకు చెందిన భాస్కర్ గేదె చనిపోయింది. చలి తీవ్రతను తట్టుకోలేక రాచర్లకు చెందిన రెడ్డి ఏబీ జెర్సీ ఆవు మృతి చెందింది. దీని విలువ రూ.1.20 లక్షలని బాధితుడు తెలిపాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా పులివల్లంకు చెందిన పి.నాగేంద్ర ఇంట్లో వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదాల గురించి జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు తహసీల్దార్ తెలిపారు.


పెద్ద పాండూరులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన గేదె

పులకింత



తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు శేషాచల ప్రకృతి సోయగం కనువిందు చేస్తోంది. రమణీయ దృశ్యాలతో యాత్రికులను కట్టిపడేస్తోంది. కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాలతో ఆకట్టుకుంటోంది. హృదయాలను పరవశింజేసే చిత్రాలను 'సాక్షి' కెమెరా బంధించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఆర్టీసీ.. ఆదాయం వెరసి..

జిల్లా ఆర్టీసీ సంస్థ ఆదాయం గడిస్తోంది. నష్టాలను అధిగమిస్తూ లాభాపేక్షతో ముందుకు సాగుతుండడంతో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రణాళికతో ఆర్టీసీ బస్సులను తిప్పుతుండడంతో పాటు ప్రత్యేక బస్సులకు ఆర్టీసీ అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. యాత్రలకు సైతం స్పెషల్ సర్వీలను పంపుతూ ప్రయాణికులను ఆకట్టుకుంటున్నారు. కార్గో సేవలతో పాటు డీజిల్ ఆదాపై సంస్థ అధికారులు దృష్టి సారించారు. ఫలితంగా ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.



- ప్రణాళికతో బస్సులు తిప్పుతున్న ఆర్టీసీ అధికారులు
- ప్రత్యేక బస్సులకు ప్రాధాన్యత
- యాత్రల పేరుతో స్పెషల్ సర్వీసులు
- ప్రయాణికులను ఆకట్టుకోవడంతో పాటు డీజిల్ ఆదాపై దృష్టి
- ఈ ఏడాది రూ.4 కోట్ల మేర నష్టాన్ని అధిగమించిన ఆర్టీసీ

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో నష్టాలను అధిగమించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తు ప్రణాళికలతో బస్సులను నడుపుతున్నారు. నష్టాలను అధిగమించేందుకు సరికొత్త నిర్ణయాలు ఫలితాన్నిస్తున్నాయి. జిల్లాలో 5 ఆర్టీసీ డిపోలు ఉండగా, వీటి పరిధిలో 392 బస్సులు తిరుగుతుండగా, ఇందులో ఆర్టీసీ బస్సులు 343, అద్దె బస్సులు 49 ఉన్నాయి. అందులో ఇంద్ర సర్వీసులు 4, ఎక్స్‌ప్రెస్ 94, సూపర్ లగ్జరీ 26, ఘాట్ సర్వీసులు 24, పల్లె వెలుగు 222 వరకు తిరుగుతున్నాయి. ఇవి ప్రతిరోజు 255 ట్రిప్పులకు గానూ 1.66 లక్ష కి.మీ తిప్పగా, రూ. 60 లక్షల ఆదాయం వస్తోంది. కి.మీ.కు రూ.39 రాగా ఆక్యూపెన్సీ 70శాతం ఉందని అధికారులు చెబుతున్నారు. నష్టాల బాట నుంచి ఆర్టీసీని గటెక్కించాలని ఆర్టీసీ అధికారులు తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణలు, అవలంభించిన పొదుపు విధానాలు, సిబ్బంది ప్రయత్నాలు ఫలితాన్ని ఇస్తున్నాయి. రోజురోజుకూ నష్టాలను తగ్గించుకుంటూ వస్తున్నారు.

ఆదాయం పెంపు లక్ష్యం..

జిల్లాలో ఆర్టీసీ సంస్థ అధికారుల నిర్ణయాలు ఆ సంస్థను డేంజర్ జోన్ నుంచి ఆదాయ మార్గంలోకి తీసుకెళ్తున్నాయి. ప్రయాణికుల సంఖ్య తగ్గిన మార్గాల్లో అధికారులు రూట్ సర్వే చేసి, అందుకు తగ్గట్టు బస్సులను తిప్పుతున్నారు. పర్వదినాలతో పాటు శుక్ర, శని, ఆది, సోమవారాల్లో బెంగళూరు, తిరుమల, వేలూరు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను తిప్పుతున్నారు. ప్రైవేటు బస్సులు, ఆటోలతో నిరంతరం కుస్తీ పడుతున్నారు. సకాలంలో బస్సులను తిప్పడంతో పాటు ప్రయాణికులను ఆకట్టుకునేలా చూస్తున్నారు. విద్యార్థులు, వృద్ధులకు రాయితీ పాసులు ఇస్తున్నారు. లక్కీ డిప్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ డ్రైవర్లను ప్రోత్సహిస్తూ డీజిల్ ఆదాపై కన్నేశారు. గతేడాది నవంబరులో డీజిల్ కోసం రూ.7.40 కోట్లు వ్యయం కాగా ఇప్పుడు ప్రతి నెల రూ.7 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఏడాదికి రూ.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్ ఆదా కోసం సోలార్ వాడకంతో ప్రతి నెలా 10 వేల యూనిట్లే వాడుతుండడంతో రూ.లక్ష వరకు ఆర్టీసీకి మిగులుతోంది.

ప్రధాన ఆదాయ వనరుగా కార్గో


ఆర్టీసీ సంస్థకు మరో ప్రధాన ఆదాయ వనరుగా కార్గో సర్వీసు మారింది. ఈ సర్వీసు ద్వారా గతేడాది రూ.240 కోట్లు రాగా ఈసారి రూ.260 కోట్లు వచ్చాయి. డోర్ డెలివరీ సేవలు మొదలు పెట్టడంతో కార్గో ఆదాయం మరింత పెరిగిందని అధికారులు అంటున్నారు.

మరింత ఆదా కోసం..

ముున్ముందు ఆర్టీసీలో నష్టాలను మరింత అధిగమించి, ఆదాయం పెంచేలా ఆర్టీసీ అధికారులు పని చేస్తున్నారు. కార్గో సర్వీసులో భాగంగా డోర్ డెలివరీని విస్తృతం చేసేందుకు చూస్తున్నారు. బస్సుల కండిషన్‌ను ఎప్పటికప్పుడు సరిచేస్తున్నారు.

వచ్చే ఏడాదిలో జిల్లాకు 30 కొత్త బస్సులు రానున్నట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్‌తో నడిచే బస్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఆదాయం పెంపు, నష్టాలను అధిగమించడమే అధికారులు ఆర్టీసీకి రెండు కళ్లుగా భావిస్తున్నారు. కనీస ఆక్యుపెన్సీ లేని రూట్లలో బస్సులను కుదించడం వల్ల నిర్వహణ వ్యయం తగ్గింది. ఈ ఫలితంగా ఆర్టీసీ ఈ ఏడాదికి రూ.4 కోట్ల మేర నష్టాన్ని అధిగమించింది.

నష్టాలను అధిగమించడమే లక్ష్యం..



డ్రైవర్ల పనితీరును మెరుగు పరిచి డీజిల్ ఆదాకు పదును పెడుతున్నాం. దీంతో పాటు షాపుల నిర్వహణ, ఇతర ఆదాయ మార్గాలపై అన్వేషిస్తున్నాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కొత్త బస్సులు కూడా రానున్నాయి. ఏయే మార్గాల్లో బస్సులు అవసరమవుతాయో, ఆ ప్రాంతాలను గుర్తించి బస్సులను తిప్పుతున్నాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. వచ్చే ఏడాది నష్టాన్ని మరింతగా అధిగమించేలా చూస్తున్నాం.

– జితేంద్రనాథ్‌రెడ్డి, డీపీటీఓ, చిత్తూరు